క్లుప్తంగా

అయ్యప్ప భక్తుల పాదయాత్ర



అయ్యప్ప భక్తులకు వీడ్కోలు పలుకుతున్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు

నారాయణఖేడ్: అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం రామమందిరం అయ్యప్ప సన్నిధానంలో గురుస్వామి కోటగిరి నర్సింహులు, పాండుస్వామి, రమేష్ స్వామి తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బయలుదేరారు. వీరికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, బీజేపీ అభ్యర్థి జన్‌వాడే సంగప్ప, టీపీసీసీ సభ్యులు కె.శ్రీనివాస్, కొండల్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు. నారాయణఖేడ్ నుంచి శబరిమలకు 1,200 కిలోమీటర్ల దూరం, రోజుకు 25 కి.మీల చొప్పున యాత్ర చేస్తారు. జనవరి 10వ తేదీన నాటికి శబరిమల చేరుకుంటారు.

కాంగ్రెస్ నేతల పరామర్శ



నర్సుగొండ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: మండలంలోని గంగాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు జాంపాడ్ నర్సుగొండ (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పరామర్శించినవారిలో సర్పంచ్ శ్రీను, మాజీ సర్పంచ్ సంగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బస్వరాజ్, నాయకులు కొండల్‌రెడ్డి, జ్ఞాన్‌రెడ్డి ఉన్నారు.

రసాయన శాస్త్ర పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ



తనూ శ్రీవాస్తవ

పటాన్‌చెరు టౌన్: గీతం వర్సిటీ రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని తనూ శ్రీవాస్తవకు పీహెచ్‌డీ లభించింది. ఈమె 'ఏరోస్పేస్ అప్లికేషన్ కోసం థర్మల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్ అభివృద్ధి' అంశంపై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. అధ్యయనానికి గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ కుమార్, ప్రొఫెసర్ రావూరి బాలాజీ రావు మార్గదర్శనం వహించినట్లు శుక్రవారం తెలిపారు. విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ విద్యార్థినిని అభినందించారు.


ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



ఎయిడ్స్ అవగాహన ర్యాలీ

జహీరాబాద్ టౌన్: వరల్డ్ ఎయిడ్స్ డే పురస్కరించుకుని పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 3 యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ప్రాణాంతకమైందని, తరిమికొట్టేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నందు గౌడ్, విజయలక్ష్మి, అధ్యాపకులు దత్తు, నర్సింహులు, నిఖిత, లావణ్య, రమేష్, నవీన్, ఇర్షాద్ పాల్గొన్నారు.

పరామర్శ



గాయపడిన వారిని పరామర్శిస్తున్న దామోదర రాజనర్సింహా

మునిపల్లి(అందోల్): లాఠీచార్జిలో గాయపడిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా పరామర్శించారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దగోపులారం గ్రామానికి చెందిన శ్రీనివాస్, సంగయ్యను ఎంపీటీసీ పాండుతోపాటు వెళ్లి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కాగా గురువారం పెద్దగోపులారం గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద ఇరు పార్టీల కార్యకర్తలు గుంపుగా ఉండటంతో వారిని చెదరగొట్టే క్రమంలో పోలీసులు లాఠీ చార్జి జరిపినట్లు తెలిపారు. దామోదర వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ ఉన్నారు.

ఆగని వలసలు

- ఉపాధి లేక దూరప్రాంతాలకు కూలీల పయనం
- చదువుకు దూరమవుతున్న పిల్లలు
- స్థానిక ఉపాధిపై దృష్టిసారించాలని వినతి



కంగ్టి నుంచి చెరకు నరికేందుకు కుటుంబాలతో వెళ్తున్న కూలీలు

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదు. స్థానికంగా ఉపాధి లేక దూర ప్రాంతాలకు వలస పోవాల్సిన దుస్థితి. ఏటా చెరకు కటింగ్ సీజన్ వచ్చిందంటే గిరిజన తండాలు ఖాళీ అవుతున్నాయి. తండా కూలీలు వలసబాట పడుతున్నారు. వర్షాకాలంలో ఇంటిపట్టున ఉన్న వ్యవసాయ కూలీలు అక్టోబర్, నవంబర్‌లో నారాయణఖేడ్ పరిసరాల్లోని కంగ్టి, తడ్కల్ మండలాల నుంచి వేలాది మంది దాదాపు ఆరు నెలల పాటు వలస వెళ్తున్నారు. వారితోపాటు పిల్లలను సైతం తమ వెంటబెట్టుకొని వెళ్తుండటంతో వారు చదువులకు దూరమవుతున్నారు. దీంతో తరాలు మారినా తమ పిల్లలు ఉన్నత విద్యలేక కూలీలుగా మారాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్షం రోజులుగా కంగ్టి, తడ్కల్ మండలాల నుంచి కూలీలు వలసబాట పట్టారు. కొన్ని తండాల్లో ఇళ్లకు తాళాలే దర్శనమిస్తున్నాయి. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జహీరాబాద్, కామారెడ్డి, తాండూరు, వికారాబాద్, బోధన్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. వర్షాకాలంలో పంటలు పండించేందుకు సాగు పెట్టుబడుల కోసం ఆయా ప్రాంతాల నుంచి చెరకు నరికేందుకు ఒప్పందం చేసుకొని కొంత మొత్తం అడ్వాన్స్ తీసుకొని వస్తారు. సీజన్ ప్రారంభం కాగానే వెళ్లక తప్పని పరిస్థితని కూలీలు చెబుతున్నారు. తమకు స్థానికంగా ఉపాధి దొరికితే బతుకుదెరువుకు మరో చోటికి వెళ్లాల్సిన దుస్థితి ఉండదంటున్నారు. కొందరు వృద్ధులను వదిలి వెళ్లడంతో వారి బాగోగులు చూసుకొనే వారు లేక తిప్పలు పడుతున్నారు. ఇకనైనా స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తే తమకు మేలు జరుగుతుందంటున్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



పోలింగ్‌పై చర్చిస్తున్న క్రాంతికిరణ్

అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. అందోల్ అసెంబ్లీకి గురువారం జరిగిన పోలింగ్‌పై శుక్రవారం మండల పరిధి పోతులబోగుడాలోని తన నివాసంలో నాయకులతో కలిసి సమీక్ష జరిపారు. మండలాలవారీగా నమోదైన పోలింగ్ విధానం, పోలింగ్ శాతం, 2018 ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ తదితర అంశాలపై చర్చించారు. మరోసారి అందోల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురనుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాహుల్ కిరణ్, డీసీసీబీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వరము అధ్యక్షుడు వీరారెడ్డి, నాయకులు బస్వరాజ్ పాటీల్, సిదన్న పాటిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై దాడి



గాయపడ్డ యాదగిరి

పటాన్‌చెరు టౌన్: గంజాయి మత్తులో పారిశుద్ధ్య కార్మికులపై ఓ యువకుడు దాడి చేశాడు. ఈ సంఘటన శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో గంజాయి మత్తులో ఉన్న యువకుడు మంటలో తన చేతులు కాల్చుకుండటం పారిశుద్ధ్య కార్మికులు నాగలక్ష్మి, యాదగిరి చూసి వద్దని వారించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై దాడిచేశాడు. కర్రతో తలపై కొట్టడంతో యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. దాడి అనంతరం యువకుడిని స్థానికులు స్తంభానికి కట్టేశారు. పారిశుద్ధ్య కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్ సరళిపై ఆరా

సైలెంట్ ఓటింగ్ ఎవరికి లాభం?

- అంచనాలు అందక తలలుపట్టుకుంటున్న నేతలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఉత్కంఠ పోరు
- బీజేపీకి సాంప్రదాయ ఓటింగ్ నమోదు

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఏ మేరకు పోలింగ్ జరిగింది, తమకు ఏ మేరకు అనుకూలంగా ఓట్లు పడ్డాయనే దానిపై అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల బాధ్యులు, పార్టీల నేతలు, ముఖ్య కార్యకర్తల ద్వారా వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్, బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ, బీఎస్పీ అభ్యర్థి జంగం గోపి తమ పార్టీ నేతలతో వివరాలు సేకరిస్తున్నారు. తక్కువ పోలింగ్ జరిగిన ప్రాంతాల్లో తమకు ఎంతమేర అనుకూలంగా ఉంటుంది, ప్రత్యర్థులకు ఏ మేర నష్టం కలుగనుందని, అధికంగా పోలింగ్ జరిగిన ప్రాంతాల్లో ఎవరికి అనుకూలంగా ఉందనే వివరాలను తెలుసుకుంటున్నారు. సైలెంట్ ఓటింగ్ ఎంతమేర సానుకూలంగా ఉంటుంది, ఎవరెవరికి ఉపయోగకరంగా ఉంటుందనే సమాచారం సేకరిస్తున్నారు. ఎన్నికలకు ఒకరోజు ముందు బీఆర్ఎస్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పోల్ మేనేజ్‌మెంట్ ఎంత మేర లబ్ధి చేకూర్చుతుందనే దానిపై అధికార పార్టీ నేతలు సమాచారం తెలుసుకుంటున్నారు. పోల్ మేనేజ్‌మెంట్ ఏయే గ్రామాల్లో ఫలించింది, ఏయే గ్రామాల్లో నిర్వహించలేక పోయాము, అందుకుగల కారణాలను విశ్లేషించుకుంటున్నారు. 28వ తేదీన జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రియాంకగాంధీ రోడ్‌షో నిర్వహించిన సందర్భంగా పార్టీ శ్రేణులంతా హాజరయ్యారు. ఇదే అదనుగా భావించిన అధికార పార్టీ నేతలు ఆపరేషన్ పోల్ మేనేజ్‌మెంట్‌ను చేపట్టి గ్రామాలు, వార్డుల్లోని శ్రేణులను అప్రమత్తం చేశారనే ప్రచారం సాగుతోంది. పోల్ మేనేజ్‌మెంట్ తమకు ఎంత మేర లబ్ధిచేకూర్చనుందనే దానిపై విశ్లేషించుకుంటున్నట్లు తెలిసింది. అధికార పార్టీ పోల్ మేనేజ్‌మెంట్‌ను కాంగ్రెస్ పసిగట్టి చివరి నిమిషంలో వారు కూడా చేపట్టినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ నుంచి అధికార బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంది. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఏకపక్షంగా ఓటింగ్ జరిగింది. దీంతో 36వేల ఓట్ల మెజార్టీ సాధించింది. ఈ ఎన్నికల్లో మాత్రం పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. ఇరువురికి విజయావకాశాలు సమానంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ అభ్యర్థి రాంచందర్ సైతం ఆయా పార్టీల అభ్యర్థులకు దీటుగా పోటీ ఇచ్చినట్లు, విజయం తమను వరించే అవకాశం లేకపోలేదని కార్యకర్తలు గంపెడాశతో ఉన్నారు. ఓట్ల లెక్కింపు వరకు వేచిచూడాల్సిందే.

వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి అర్బన్: మతిస్థిమితం లేని వ్యక్తి కనిపించకుండా పోయినట్లు సీఐ శ్రీధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డిలోని ఇంద్ర కాలనీకి చెందిన పట్నం జగన్నాథం ఆరోగ్యం బాగా లేకపోవడంతో భార్య లక్ష్మితో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యం చేయించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో కనిపించకుండా పోయాడు. అతడికి మతిస్థిమితం సరిగాలేదు. తెలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 8712656718 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

మూడోసారి సీఎంగా కేసీఆర్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్

మునిపల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల్లో 70–80 స్థానాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీలో గెలుస్తున్నారని, మూడోసారి సీఎంగా కేసీఆర్ ఉంటారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మంపల్లి బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. అందోల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ సమారు పది వేలపై మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. నకిలీ సర్వేలను ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివశంకర్, భాస్కర్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌కు 18 వేల మెజార్టీ ఖాయం

మునిపల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహాకు 18 వేల మెజార్టీ వస్తుందని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ శుక్రవారం ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో 75 నుంచి 80 స్థానాలలో తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తున్నట్లు జోస్యం చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేయడం జరుగుతుందన్నారు.

ఈవీఎంల తరలింపు



కార్గో బస్సుకు తాళం వేస్తున్న అధికారి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను శుక్రవారం ఆర్టీసీ కార్గో బస్సుల్లో పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు. నియోజకవర్గంలోని 15 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటలు దాటిన ఓటర్లు పెద్దసంఖ్యలో బారులు తీరి ఉండటంతో రాత్రి 8 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. అనంతరం ఈవీఎంలను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో రెండు ఆర్టీసీ కార్గో బస్సుల్లో తరలించారు. ఈఆర్వో వెంకటేశ్ పర్యవేక్షించారు.

83.23 శాతం పోలింగ్ నమోదు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 2,31,188 మంది ఓటర్లకుగాను 1,92,418 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 83.23 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి వెంకటేశ్ శుక్రవారం తెలిపారు. పురుషులు 98,805 మంది, మహిళలు 93.610, ఇతరులు ముగ్గురు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఖేడ్ మండలంలో 46,238 మంది, నాగల్‌గిద్దలో 20,961, సిర్గాపూర్‌లో 20,315, కంగ్టిలో 28873, కల్హేర్‌లో 14,885, మనూరులో 20,684, నిజాంపేటలో 14,634, పెద్దశంకరంపేట 25,828 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా కల్హేర్ మండలంలో 86.53 శాతం, నారాయణఖేడ్ మండలంలో అతి తక్కువగా 78.53 శాతం పోలింగ్ నమోదైంది.

పట్టణంలో ఓట్లేసింది 11,244

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో మొత్తం ఓటర్లు 17,213 మంది ఉన్నారు. పురుషులు 8,901మంది, మహిళలు 8,310 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 11,244 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా అందులో పురుషులు 5,805, మహిళలు 5,438 మంది కాగా ఇతరులు ఒకరు ఉన్నారు.

ఓటర్ల సంఖ్య పెరిగినా..



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): శాసనసభ ఎన్నికల్లో మండలంలో 80 శాతం పోలింగ్ జరిగింది. 2018లో జరిగిన ఎన్నికల్లో కూడా 80 శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు పెరిగినా పోలింగ్ శాతం పెరగలేదు. 2018లో జరిగిన ఎన్నికల్లో 43,346 మంది ఓటర్లు ఉండగా 34,954 మంది, ప్రస్తుత ఎన్నికల్లో 46,836 మంది ఓటర్లకుగాను 37,483 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

గ్రామాలవారీగా..

న్యాల్‌కల్‌లో మొత్తం 3,214 ఓట్లు ఉండగా 2,341 ఓట్లు పోలయ్యాయి. హుస్సేన్‌నగర్‌లో 1,116కుగాను 795, చీకూర్తిలో 921కిగాను 767, అమీరాబాద్‌లో 580కిగాను 502, కాకిజన్‌వాడలో 970కిగాను 741, ముర్తుజాపూర్‌లో 532కుగాను 423, రాఘవాపూర్‌లో 968కిగాను 847, చాల్కిలో 1,296కుగాను 1,014, హుమ్నాపూర్‌లో 509కిగాను 445 ఓట్లు పోలయ్యాయి. ఇబ్రహీంపూర్‌లో 1,139కిగాను 847, మెరియంపూర్‌లో 477కుగాను 443, రత్నాపూర్‌లో 1,417కుగాను 1,207, మల్గిలో 1,664కుగాను 1,357, డప్పూర్‌లో 2,074కుగాను 1,553, చినిగెపల్లిలో 940కిగాను 757, అత్నూర్‌లో 1,335కుగాను 992, రాంతీర్థ్‌లో 811కుగాను 665, వడ్డిలో 1,885కుగాను 1,412, శంశల్లాపూర్‌లో 671కిగాను 597, గణేష్‌పూర్‌లో 603కుగాను 510, హుస్సెళ్లిలో 683కుగాను 555, గుంజోటిలో 1,428కిగాను 1,126, మొల్కన్‌పాడ్‌లో 283కుగాను 234 ఓట్లు పోలయ్యాయి. హద్నూర్‌లో 3,040కిగాను 2,299, రుక్మాపూర్‌లో 431కిగాను 378, ముంగిలో 1,318కిగాను 1,100, మిర్జాపూర్(ఎన్)లో 845కుగాను 691, తాట్‌పల్లిలో 244కుగాను 204, టేకూర్‌లో 930కిగాను 764, రేజింతల్‌లో 2,511కుగాను 1,985, న్యామతాబాద్‌లో 743కుగాను 634, మామిడ్గిలో 2,232కుగాను 1,765, రాజోలలో 1,137కుగాను 953, కల్బేమల్‌లో 1,929కుగాను 1,319, బసంత్ పూర్‌లో 1,044కుగాను 848, మెటల్‌కుంటలో 1,990కిగాను 1,676, గంగ్వార్‌లో 1,038కిగాను 880, మిర్జాపూర్(బి)లో 1,607కుగాను 1,130, ఖలీల్‌పూర్‌లో 889ఓట్లకుగాను 747 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కల్బేమల్‌లో అతి తక్కువగా 68 శాతం పోలింగ్ నమోదు కాగా మెరియంపూర్‌లో 93 శాతం పోలింగ్ జరిగింది.

జహీరాబాద్‌లో 76.72 శాతం పోలింగ్

గత ఎన్నికల కంటే తగ్గిన ఓటింగ్



పోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

జహీరాబాద్: అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో 76.72 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 81.35 మేర పోలింగ్ జరిగింది. గత ఎన్నికలతో పోల్చి చూస్తే మూడు శాతానికి పైగా పోలింగ్ తగ్గింది. ఈ ఎన్నికల్లో ఓట్లు పెరిగినా అందుకు అనుగుణంగా పోలింగ్ పెరగలేదు. పలు గ్రామాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ జరగడం విశేషం. పట్టణంతో పోల్చితే గ్రామాల్లోనే పోలింగ్ అధికంగా నమోదైంది. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో 50 నుంచి 65 శాతం వరకు పోలింగ్ జరిగింది. పలు గ్రామాల్లో 70 శాతానికి పైగా, మరికొన్ని గ్రామాల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మన్నాపూర్, సజ్జారావుపేట తండా, సిద్ధాపూర్ తండా, మిరియంపూర్ గ్రామాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది.

కిష్టయ్య ఆశయాలను కొనసాగిద్దాం



కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మలిదశ తెలంగాణ పోరాటంలో వీర మరణం పొందిన కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ ఆశయాలను కొనసాగిద్దామని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 14 వర్ధంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు జంగిటి శ్రీనివాస్, బైరి శంకర్, పార్వతి బైరయ్య, పైసా రామకృష్ణ, గాడిచెర్ల సతీష్, తొట్ల పర్శరాములు, పడిగే ప్రశాంత్, పాతర్ల వెంకటేశ్వర్లు, బోనాల నాగరాజు, బోనాల శ్రీనివాస్, సూతరి రాజు, గాడిచెర్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని శుక్రవారం చిన్నకోడూరులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు కిష్టయ్య అని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, నాయకులు నారాయణ, సుధాకర్, శ్రీకాంత్, శేఖర్, నాగరాజు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన, అలంకరణ, ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిరండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట సాధనకు ఈనెల 4న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి దళిత బహుజనులు తరలిరావాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగుపల్లిలో శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్త ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అటకెక్కించి భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ విధి విధానాలను ప్రతిఘటిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు కిరణ్, బాల్‌నర్సు, ఎల్లవ్వ, అనసూయ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో వైన్స్‌లు వద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): జన సమూహం, పాఠశాలలు, ఇళ్ల మధ్య వైన్స్ షాపులకు అనుమతి ఇవ్వొద్దని చిన్నకోడూరు గ్రామ యువకులు ఎక్సైజ్ శాఖ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. చిన్నకోడూరులో బస్టాండ్, పాఠశాలల సమీపంలో వైన్స్‌లు ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఈవిషయమై గ్రామ పంచాయతీకి, ఎక్సైజ్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆలయ నూతన కమిటీ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని శ్రీ మహంకాళీ ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్ముల స్వామి, ఉపాధ్యక్షుడిగా తోకల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా స్వామి, సహాయ కార్యదర్శిగా తోట వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.